



సిరిచెల్మలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్, బారులు తీరిన భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకర!

- జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- వేకువజాము నుంచే ప్రధాన ఆలయాల వద్ద భక్తుల బారులు
- భక్తులతో కిక్కిరిసిన సిరిచెల్మ మల్లన్న ఆలయం
- శివుడు, శివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- భక్తుల ఉపవాస దీక్షలు, జాగరణ
- జిల్లావ్యాప్తంగా ముక్కంటి నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 8: ఓం నమ: శివయ.. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తులు శివతన్మయత్వంలో మునిగి పోయారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు జరుపుకున్నారు. రోజంతా ఉపవాసం, రాత్రంత జాగరణతో ఆ పరమశివుడి ధ్యానంలో గడిపారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర శివాలయం, శ్రీరాంకాలనీ శివాలయం, రాంనగర్‌లోని మల్లికార్జున ఆలయం, సంజయ్‌నగర్‌లోని శివలింగేశ్వర ఆలయంతో పాటు జిల్లాలోని కుంటాల, పెండల్‌వాడ, జైనథ్ మండలంలోని కంఠ కోటిలింగాలు, ఇచ్చోడ మండలంలోని రాజరాజేశ్వర ఆలయం, తలమడుగు మండలంలోని ఝరి, ఇంద్రవెల్లి మండలంలోని నాగోబా వంటి పుణ్య క్షేత్రాల్లో భక్తులు పెద్దఎత్తున ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరగా ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణం అర్ధరాత్రి లింగోద్భవ నేత్రపర్వంగా సాగాయి. కాగా గంగపుత్ర శివాయలంలో ఎమ్మెల్యే పాయలశంకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పూజలు నిర్వహించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆయా శివాలయాల్లో భక్తుల శివనామస్మ రణతో సందడిగా మారాయి. మావల పరిధిలోని శివాలయాలు సైతం భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఉదయం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తూ అల్పాహారంతోనే శంభో శంకర హరహర మహాదేవా అంటూ భక్తిని చాటుకున్నారు. ఉపవాస దీక్షలతో ఆలయాలకు బారులు తీరిన భక్తులు పెద్దఎత్తున శివలింగాలకు పాలాభిషేకం చేసి శివపార్వతులకు పూజలతో కానుకలను సమర్పించుకున్నారు. శివాలయాల వద్ద భక్తుల సందర్శనార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు బందోబస్తును ఏర్పాటు చేయగా భక్తులు వందల సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు కల్యాణం, రుద్రాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వర ఆలయంలో పలువురు భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



గంగపుత్ర శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల



ఉట్నూర్‌లో అభిషేకం చేస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



పట్టణంలో పూజలు చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆలయాల్లో ప్రముఖుల పూజలు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీకంది శ్రీనివాస్‌రెడ్డి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన సతీమణి కంది సాయిమౌనారెడ్డితో కలిసి పట్టణంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. అదే విధంగా జైనథ్, బేల మండలాల్లోని పలు ప్రసిద్ధి చెందిన ఆలయాలను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతివెంకట్‌రెడ్డి, నాయకులు గిమ్మ సంతోష్, ఆశమ్మ తదితరులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిరిచెల్మకు పోటెత్తిన భక్తజనం

ఇచ్చోడ: మండలవ్యాప్తంగా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మల్లన్నకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు మల్లన్న దర్శనానికి పోటేత్తారు.

ఏజెన్సీలో మహాశివరాత్రి ఉత్సవాలు

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉట్నూర్ మండల కేంద్రంలోని రామ్‌నగర్‌లో ఉన్న కాకతీయుల నాటి ప్రతాపరుద్రుడు నిర్మించిన శివాలయంలో పూజారి సంతోష్‌దుబే ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివలింగానికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం ఘనంగా జరిగింది. పార్నంది శివకుమార్ దంపతులతో పాటు పృథ్వి దంపతులు శివ కళ్యాణం వేడుకల్లో పాల్గొన్నారు. సాలెవాడ(కె)లో ఉన్న మహాదేవ ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుని శివపూజలు నిర్వహించారు.

నాగోబా ఆలయంలో ప్రవచనాలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలివచ్చి నాగోబా దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా కుమ్ర దత్తు మహరాజ్ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని నాగోబా దర్శనం కోసం వచ్చిన భక్తులకు కేస్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం శేకు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మహా శివ రాత్రి పర్వదినాన్ని శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పరమ శివుడిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజాలు, అభిషేకాలు జరిపారు. కాగా, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండల కేంద్రంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు.

తలమడుగు: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఉన్న ఏకబిల్వం శివాలయాన్ని జరి గ్రామాలలో ఉన్న పురాతన శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శివలింగాలను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జరి ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కేద్రేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, అబ్దుల్లా, కిరణ్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని జరి, చర్లపల్లి, రుయాడి, తలమడుగు, కజ్జర్ల, తదితర గ్రామాల్లోని శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



కుంభఝరి కోటిలింగాల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉట్నూర్‌లో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కేస్లాపూర్‌లో ప్రవచనాలు ఇస్తున్న కుమ్ర దత్తు మహరాజ్



గుడిహత్నూర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బోరజ్‌లో భక్తుల రద్దీ

జైనథ్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని బోరజ్, కోరట, పెండల్‌వాడ తదితర గ్రామాల్లో గల శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిలాలాడాయి. ఈ సందర్భంగా శివపార్వతులు శివలింగ, గణపతి, తదితర దేవతాల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పాటు శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని నందీశ్వరుడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాలలో ప్రత్యేకజ ఆగరణ కార్యక్రమాన్ని నిర్వహించి శివపార్వతులకు వేద మంత్రాల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం లింగోద్భవం నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆడలోని శివాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడుతున్న బోరజ్ శివాలయం



కోరటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



చర్లపల్లి ఏకబిల శివాలయంలో పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



చేతులు కలిసేనా?!

- డీసీసీ మాజీ అధ్యక్షుడిపై సస్పెన్షన్ ఎత్తివేత
- త్వరలోనే ముగ్గురు సీనియర్ నేతలపై కూడా..
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ యూ టర్న్
- చిచ్చురేపుతున్న డీసీసీ అధ్యక్ష పీఠం
- అధికారంలోకి వచ్చినా.. చల్లారని వర్గపోరు

ఆదిలాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చినా.. కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత కనిపించడం లేదు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి ఓడిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. ఎలాగైనా ఈసారి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది. తాజాగా డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్‌పాండేపై సస్పెన్షన్ ఎత్తి వేయడంపై జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్తగా చేరికలతో పాటు పార్టీకి దూరమైన సీనియర్ నేతలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఓటమిపాలైన పార్టీ అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా నియమించిన కాంగ్రెస్ వారి ద్వారానే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. కానీ, నేతల మధ్య సఖ్యత లేకపోవడం.. ప్రతిపక్ష పార్టీలు బలంగా ఉండడం.. కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికరంగా మారిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.





ముగ్గురు నేతల రీ ఎంట్రీ

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేసిన ముగ్గురు సీనియర్ నేతలు సంజీవ్‌రెడ్డి, సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాతలపై కూడా త్వరలోనే సస్పెన్షన్ ఎత్తి వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలను కలిసిన సీనియర్ నేతలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉం టున్న ఈ ముగ్గురు నేతలు ఇతర పార్టీలలో చేరేందుకు ఆసక్తి చూప డం లేదు. ఇంకా ఎదురు చూసే ధోరణితోనే కనిపిస్తున్నారు. పార్టీలోకి ప్యారాచుట్ నేతలు వద్దంటూ బలంగా వ్యతిరేకించిన సీనియర్లకు.. ప్రస్తుతం పార్టీలో మనుగడ లేకుండా పోయింది. అందుకే రాజకీయా ల్లో శత్రువులు మిత్రులంటూ ఉండరని రాజకీయ విశ్లేషకులు పేర్కొం టున్నారు. త్వరలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధిష్ఠానం రెబల్స్ నేతలపై యూటర్న్ తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

టార్గెట్ కంది!!

ఆదిలాబాద్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి టార్గెట్‌గానే కాంగ్రెస్‌లో వర్గపోరు కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. బోథ్, ఖానాపూర్ ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితి ప్రశాంతంగానే కనిపిస్తున్నా.. ఆదిలాబాద్‌లో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క కూడా నియోజక వర్గ నేతలను హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఇటీవల కంది వెంట ఉన్న కొంతమంది నేతలే మరో వర్గంగా ఏర్పడి డీసీసీ పీఠం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా మావల శ్రీకాంత్‌రెడ్డితో పాటు మరి కొంతమంది కందికి వ్యతిరేకంగా పార్టీలో పావులు కదుపుతున్నట్లు తెలు స్తుంది. తాజాగా భార్గవ్‌దేశ్‌పాండేపై సస్పెన్షన్ వేటు ఎత్తి వేయడంతో ఆయన కూడా కంది వ్యతిరేక వర్గంతో చేతులు కలిపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల మార్కెట్ పదవుల విషయంలోనూ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇన్‌చార్జీల మధ్య కొంత వివాదం తలెత్తినట్లు సమాచారం. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కూడా కంది శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగానే ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే కందికి అధిష్ఠానం పెద్దల వద్ద మంచి పలుకుబడి, నియోజకవర్గంలో ఇన్‌చార్జీల నిర్ణయమే ఫైనల్ అని పార్టీ ఆదేశాలు ఉండడంతో కంది శ్రీనివాస్‌రెడ్డి వర్గంలో ధీమా కనిపిస్తోంది.





కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్/మావల, మార్చి 8: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజార్షిషాను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అయితే ప్రభుత్వం, అధికారులు అమలు చేసే సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధిని కూడా ప్రజలకు చేరే విధంగా ప్రజా ప్రతినిధులుగా అధికారులకు తమ పూర్తి సహకారం ఉంటుందని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇందులో ఆదివాసీ జిల్లా చైర్మన్ ఆనంద్‌రావు, మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, సంతెన్న, తదితరులున్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



పెండల్‌వాడ ఆత్మలింగ హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్

జైనథ్, మార్చి 8: జైనథ్, బేల మండలాల్లోని ఆయా గ్రామాల్లో శివాలయాలతో పాటు మండలంలోని పెండల్‌వాడ ఆత్మలింగ హనుమాన్ ఆలయాన్ని శుక్రవారం ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ సిబ్బంది శాలువ మెమొంటోలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, జిల్లా మహిళ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, నాయకులు అల్లూరి అశోక్‌రెడ్డి, జంగిలిసురేష్, పట్టెపు వసంత్‌రావ్, సుంకిర ప్రశాంత్‌లతో పాటు పెండల్‌వాడ గ్రామ ప్రజలు, పెద్దసంఖ్యలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

● బోథ్ సివిల్ కోర్టు న్యాయాధికారి

ఇచ్చోడ, మార్చి 8: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.హుస్సెన్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళలు, విద్యార్థుల చట్టాలపైన, వారి హక్కులపైన అవగాహన కల్పించి విద్యార్థులను చైతన్యవంతం చేశారు. అనంతరం పాఠశాలలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మల్లిక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేష్, కేజీబీవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ కస్తూర్బా పాఠశాలలో చట్టాల గురించి వివరిస్తున్న న్యాయాధికారి బి.హుస్సెన్



స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

వేంకటేశ్వరస్వామి విగ్రహాల ఊరేగింపు

తాంసి, మార్చి 8: తాంసి, పొన్నారి, హస్నాపూర్ గ్రామాలకు శనివారం కరంజి గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచి ఆయా గ్రామాలలోకి వచ్చిన వెంకటేశ్వర స్వామి విగ్రహాలకు స్థానిక గ్రామస్తులు మేల వాయిద్యాలు, మంగళహారతులతో స్వాగతించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ భిక్షాటన చేశారు. పల్లకిని మోసేందుకుకోసం జనం క్యూ కట్టారు.

'ఖేలో ఇండియాకు జిల్లా ఎంపికవడం అభినందనీయం'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 8: ఖేలో ఇండియా సెంటర్ ఏర్పాటుకు జిల్లా ఎంపిక కావడం అభినందనీయమని, దేశంలోని ఈ సెంటర్ ఉన్న చోట 8 కోర్టుల చొప్పున ఆస్ట్రోటర్ఫ్ కోర్టు చేయనున్నారని ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీ కోర్టును తొలగించగా పునర్నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలూరిగోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఖేలో ఇండియాలో ఆస్ట్రోటర్ఫ్ కోర్టు నిర్మాణం అయితే గచ్చిబౌలి స్టేడియం తర్వాత ఇందిరా ప్రియదర్శినిలో ఉంటుందన్నారు. ప్రధానమంత్రి సభ సందర్భంగా స్టేడియంలో హాకీ కోర్టుతో పాటు ప్రహరిగోడను తొలగించారని తెలిపారు. అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే పాయల శంకర్ హామీ ఇచ్చి దాన్ని నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. దీనికి వారికి ధన్యవాదాలు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మావల, మార్చి 8: గ్రామీణ క్రీడాకారులు నైపుణ్యతకు కొదవలేదని దాన్ని గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కృషి చేస్తుందని అయితే క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ఎంతో నైపుణ్యత దాగి ఉంటుందని, అయితే వారికి గుర్తింపు లేక వెలుగులోకి రాలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్, సంటెన్న, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి : పీఆర్టీయూ

● మాజీ మంత్రి హరీష్‌రావు ఫ్లెక్సీ దహనం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 8: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను కించపరిచే విధంగా మాజీ మంత్రి హరీష్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు హర్ష వర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గల రహదారి పై హరీష్‌రావు ఫ్లెక్సీని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి దహనం చేశారు. అనంతరం హరీష్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వల్లనే అధికారంలోకి వచ్చిన హరీష్‌రావు వారిని చులకనగా చేసి మాట్లాడడం సరికాదన్నారు. ఉద్యోగులు, రైతులను పట్టించుకోని కారణంగా నేడు అధికారం కోల్పోయారన్నారు. బీఆర్ఎస్ హాయంలో 15వ తేదీ వరకు వేతనాలు వచ్చేవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందిస్తుందన్నారు. దీన్ని ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, రైతులను మోసం చేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్న విషయాన్ని హరీష్‌రావు గుర్తించాలన్నారు. ఉద్యమకాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించిన విషయాన్ని గుర్తుంచుకో వాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి హాయాంలో రైతులు, ఉపాధ్యాయులకు సమన్యాయం చేస్తున్నామన్నారు. రైతుబంధు డబ్బులు వేశామని, త్వరలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు.

● 'బేషరతుగా క్షమాపణ చెప్పాలి'

బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు ఏసీల్లో పని చేసే ఉద్యోగులకు రైతుబంధు డబ్బులు ఆపి వేతనాలు చెల్లిస్తున్నారని చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సునిల్‌చౌహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ముందు వరుసలో ఉండి పోరాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులను కించపరిచే మాట్లాడడం సరికాదన్నారు. తన వ్యాఖ్యలను ఉప సంహరించుకుని క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఇందులో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, గంగాధర్, శ్రీమంత్‌రెడ్డి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం

గుడిహత్నూర్, మార్చి 8: మండలంలోని తెలంగ్‌రావ్‌గూడలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు గెలుపొందిన విజేతల జట్లకు నగదుతో పాటు కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, బుచ్చన్న, లవాన్, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రికెట్ జట్టుతో ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు

కరంజి రోడ్డు కోసం.. 50 గ్రామాల ప్రజల నిరీక్షణ

● వచ్చే లోక్ సభ ఎన్నికలను బహిష్కరించే దిశగా ప్రయత్నాలు

భీంపూర్, మార్చి 8: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి నుంచి సరిహద్దు గ్రామాలైన కరంజి (టి), గుబ్‌డీ వరకు 50 కిలో మీటర్ల రోడ్డు అడుగు పెట్టలేని విధంగా తయారైంది. అప్పుడు బీఆర్ఎస్ సర్కారు హయాంలో, ఇప్పటి కాంగ్రెస్ పార్టీ హయాంలో నాయకులు, ప్రజలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకుని విసిగిపోయి నిధులు మంజూరు అయ్యాయి. ఇక టెండర్ తరువాయి ఇక టెండరు వేసి రోడ్డు నిర్మించడమే తరువాయి అంటూ గత సర్కారు బూకాయించి పదేళ్ళు నెట్టుకొచ్చింది. తరువాత వచ్చిన ప్రభుత్వం అయిన ఈ పెద్ద కార్యం ప్రారంభించేలా కనీసం కాంగ్రెస్ నాయకులు కూడా ప్రయత్నం చేయటం లేదు. ఈ పార్టీ వారు కూడా ఈ ప్రాంతంలో ప్రధాన సమస్య అయిన రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ దశలో ఈ రోడ్డుపై ఆర్టీసీ వారు కూడా ఎంతో కష్టంగా బస్సులు నడుపుతున్నారు. డ్రైవర్లు ఈ రూట్‌లో డ్యూటీకి జంకుతున్నారు. 50 గ్రామాల ప్రయాణీకులకు ప్రయోజనకరంగా ఉన్న ఈ రోడ్డు జిల్లాలోనే ఆర్టీసీకి బాగా కలెక్షన్‌లు ఇచ్చే రూట్ కాగా అన్ని పార్టీల నాయకులు, అధికారుల మీద నమ్మకం పోయిన ప్రజలు ఇప్పుడు వచ్చే ఎన్నికలను బహిష్కరించే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఈ పని కోసం జేఏసీ కూడా ఏర్పడుతున్నట్లు తెలుస్తుంది. పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మండానికి చెందిన గోళ్ళగాడ్ గ్రామస్తులు ఎన్నికలు బహిష్కరించిన



పిప్పల్‌కోటి-నిపాని మధ్య కంకర తేలిన రోడ్డు

విషయం తెలిసిందే. అలాగే సరిహద్దు గుబ్‌డి గ్రామస్తులు కూడా గతంలో ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి తరువాత అప్పటి కలెక్టర్ దివ్య దేవరాజన్ హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.

● అధికారులు కళ్లు తెరిస్తే బాగుంటుంది

భీంపూర్ మండలంలో ఈ రోడ్డు విషయమే ప్రధానం అని ఉన్నత అధికారులు కూడా సీరియస్‌గా తీసుకున్నట్లుగా లేదు. నిజానికి అమాయక మనస్తత్వమే కనిపించే ఈ ప్రాంత ప్రజలు రోడ్డు గురించి అంతగా నిలదీయరు అని అధికారి బావిస్తున్నట్లు



ఇదీ దన్నోరా-వడూర్ మధ్య రోడ్డు పరిస్థితి

కనిపిస్తుంది. రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని చెబుతున్నట్లు టెండర్ ప్రక్రియ ముగించి పనులు ప్రారంభిస్తే బాగుంటుంది లేక పోతే ఒకటి రెండు గ్రామాలు కాదు మొత్తం 26 గ్రామ పంచాయితీలు అనుబంధ గ్రామాలు కలిసి 50 గ్రామాలు ఎన్నికలను బహిష్కరిస్తే అధజకారులు ప్రజాప్రతినిధులకు చెడ్డపేరే. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్ళు తెరిస్తే బాగుంటుంది.

● అదే ఆలోచనలో ఉన్నాం

: ఏల్టి నరేష్‌రెడ్డి, విద్యావంతుడైన రైతు, కరంజీ (టి)



ఓటు హక్కు అమూల్యమైనది మాకు తెలుసు కాని సమస్యలను ఏ పార్టీకి చెందిన వారికి అని మేము ఈ రోడ్డు సమస్యతో ఏళ్ళకెళ్ళు బాధపడుతున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్‌లకు వందల సార్లు విజ్ఞప్తి చేశాం. అన్ని పారత్టల నాయకులతో మొర పెట్టుకున్నాం ఎవరూ స్పందించలేదు. ఈ పరిస్థితుల్లో మా హక్కుగా తప్పకుండా జేఏసీ ఏర్పాటు చేస్తున్నాం, తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికల బహిష్కరణ నిర్ణయం తీసుకోబోతున్నాం.

వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు

మావల, మార్చి 8: మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని పలు ఆలయాలు ముందస్తు శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారు జామున నుంచే భక్తులు ఆ పరమ శివుణ్ణి దర్శించుకున్నారు. అంకోలి రోడ్, రాజరాజేశ్వర ఆలయం, తంతోలి రామలింగేశ్వర ఆలయం, కుంబధరి కోటి లింగాల, రాంనగర్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేరడిగొండ: మండలకేంద్రంతో పాటు కుంటాల, సావర్గాం, వడూర్, బుగ్గారం, కుమారి, తదితర గ్రామాలలోఉన్న శివాలయం శ్రీరాజరాజేశ్వర ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నేరడిగొండ మండల కేంద్రంలో గల రాజరాజేశ్వర స్వామి వారిని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి పండుగను భక్తులు జరుపుకోవాలని కోరారు. బోథ్ నియోజక వర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అనిల్ అన్న యువసైన్యం సభ్యులు తదితరులున్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి శివాలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో డప్పు వాయిద్యాల నడుమ శివాలయం చేరుకుని కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.

తాంసి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న శివాలయాల్లో శివపార్వతులకు అంగరంగ వైభవంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రాలు వందలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ ఆలయాలు సందడిగా కనిపించాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని బండల నాగపూర్, వడ్డాది, కప్పర్ల, రామనగర్, గిరిగావ్, పొన్నారి గ్రామాలలో ఉన్న శివాలయాలు ఉదయం నుంచే భక్తులతో సందడిగా కనిపించాయి. సాయంత్రం శివపార్వతులకు కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేళా



నేరడిగొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్



పిప్పల్‌కోటిలో డప్పువాయిధ్యాల మధ్య పల్లకీ ఊరేగింపు



సోనాల గ్రామంలో రాజరాజేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాయిద్యాలతో ముందుగా శివపార్వతులను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

● ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బోడగుట్ట శివాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిసారి ఆలయం సందర్శించడంతో అక్కడి భక్తులు ఆయనను సన్మానించారు.

బోథ్: మండలంలో శివరాత్రి పండుగ వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని సోనాల గ్రామ పురాతన రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపుకున్నారు. మండల కేంద్రం సమీపంలోని అడవుల్లో ఉన్న కైలాస్టేడికడి అడవుల్లో వెలసిన శివాలయం వద్ద శివలింగ దర్శనానికి భక్తులు మహారాష్ట్ర, తెలంగాణ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. అదే విధంగా కుచ్చలాపూర్ సమీపంలోని చిన్న వాగు వద్ద శివలింగాన్ని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆయా గ్రామాలలోని హనుమాన్ ఆలయాలను సందర్శించి శివలింగాలకు ప్రత్యేక పూజలు చేసి కొత్త శనగల పప్పు, బెల్లం నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా పంచిపెట్టారు. అన్ని గ్రామాలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

కాగా, మండలంలోని కుశలాపూర్ చిన్న వాగు వద్ద జరిగిన జాతరలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి శనివారం తెల్లవారే వరకు పేకాట జోరుగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలాది రూపాయలు పెట్టి పేకాటలో పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని పలు ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. శివరాత్రి పండుగ మహోత్సవమును పురస్కరించుకుని గ్రామాలలో ఆలయాలను విద్యుత్ కాంతులతో వెలిగిపోయేల గ్రామస్థులు అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయక్ర ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అంతేకాకుండా మండలంలోని ఆయా గ్రామాలలో గల శివాలయాలలో భక్తి కీర్తనలతో జాగరణలు చేశారు. పలు ఆలయలు భక్తులతో కిటకిటలాడాయి.



ఇంద్రవెల్లిలో పారిశుధ్య మహిళా కార్మికులను శాలువాతో సన్మానించిన దృశ్యం



మల్యాల్‌లో మహిళలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళలు శ్రమదోపిడీ నుంచి విముక్తి కావాలి

● రాంజీగోండు ఆశయం సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉట్నూర్, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాంజీ గోండు ఆశయం సాధన సమితి జిల్లా అధ్యక్షులు లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. శుక్రవారం మహిళ ఉద్యమ నాయకురాలు మర్సుకోల సరస్వతి అధ్యక్షతన ఉట్నూర్‌లోని రాంజీ గోండు నగర్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు అణిచి వేత నుంచి విముక్తి పొంది అన్ని రంగాలలో రాణించడానికి సంసిద్ధులు కావాలని అన్నారు. ఆదిమ కాలం నుంచి ఆధునిక సమాజంలో కూడా నేటికి మహిళలు హింసకు గురవుతునే ఉన్నారని అన్నారు. పురుషాధిక్యత గృహింస నేటికి మహిళల పట్ల కొనసాగుతునే ఉందని అన్నారు. ఆచరణలో అన్ని రంగాలలో రాణించినప్పుడే నిజమైన స్త్రీ విముక్తి అని అన్నారు. అందుకే మహిళలందరు ఐక్యమై తమ సమస్యల సాధనకై ముందుకు నడవాలని అన్నారు. శ్రమదోపిడీ హింస పని ప్రదేశాల్లో లైంగిక వైదింపులు నేటికి కొనసాగడం విడ్డూరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు మర్సుకోల సరస్వతి, కడమండ్ల రాజమణిరాయిసెంటర్, సార్‌మేడి సలాందేవరావు, రామ్‌జి గోండునగర్, గ్రామపటేల్ కాత్‌లే హంస్సేన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మహిళలతో కలిసి కేక్ కట్ చేసి తినిపించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షుడు రామన్న మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత కాలంలో మహిళ శక్తి వెలుగు వెలుగుతోందన్నారు. సృష్టికి మూలం మహిళలు తమలోని శక్తిని గుర్తిస్తూ సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్లు స్వరూప, మమత, పర్వీన్, సురేఖ, నాయకులు అజయ్, బండారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

● టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఇదిలా ఉంటే టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా భ్రూణ హత్యల పై చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ అనిత, టీఎస్‌యూటీఎఫ్ మహిళ విభాగం నాయకురాళ్లు సురేఖ, ఐద్వా నాయకురాళ్లు జమున, శకుంతల, మంజుల, అరాఫా తదితరులు పాల్గొన్నారు. మరో పక్క తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల దినోత్సవం ప్రత్యేకతతో పాటు చట్టాలు, హక్కుల గురించి ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి మంజుల వివరించారు. మహిళలు వారికి ఉన్న హక్కులు, చట్టాల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవాలన్నారు. ఇందులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, పొచక్క, స్వామి, రేణుక, చాయ, లత, అరిఫా తదితరులున్నారు. బెస్ట్‌ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా రంగాల్లో రాణిస్తున్న వైద్యులు, మహిళలను సత్కరించి ప్రశంస పత్రాలను అందించి సత్కరించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో వైద్యులు సుమలత, రమఅశోక్, సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

● 'మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి'

ఇంద్రవెల్లి: మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మేజర్ గ్రామ పంచాయితీ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య మహిళా కార్మికులకు శాలువాతో సన్మానించారు. ఇందులో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎం.డి.మసూద్, జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, పట్టణ అధ్యక్షులు ఎం.డి.జహీర్, మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావు, సేవాదళ్ మండల అధ్యక్షుడు చహకటి మాణిక్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని మల్కాల్ గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించే మొదటి పథకంపై సంతకం చేశారని మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వనికి ఉన్న నిబద్ధతను నిరూపించుకున్నారన్నారు. ఇందులో కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్రం కోటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవయే మాధవ సేవ

● 250 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేసిన జడ్పీటీసీ

తలమడుగు, మార్చి 8: మానవ సేవే మాధవ సేవగా భావించి గత 26 సంవత్సరాల నుంచి ప్రతి శివరాత్రి పండుగకు 250 మంది పేద ప్రజలకు ఉచితంగా వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1998లో, శివాలయం నిర్మించి అప్పటి నుంచి ప్రతి సంవత్సరం హోమం, అభిషేకం, కళ్యాణం, చేయిస్తూ వస్త్రా దానం చేస్తూ ఈ సంవత్సరం కూడా గ్రామానికి చెందిన నిరుపేదలు 250 మంది పేద ప్రజలకు వస్త్రధానం చేపట్టారు. పేద ప్రజల అండదండలతోనే తాను ఈ స్థాయికి వచ్చానని వారి సహకారం ఎప్పటికీ మర్చిపోనన్నారు. అనంతరం పేద ప్రజలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌రావు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతాం : పీఆర్టీయూ

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 8: తెలంగాణ సాధనలో క్రియాశీలంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారని, కానీ తొమ్మిదిన్నర ఏళ్లలో ఎలాంటి లబ్ధిచేకూరక పోగా, అవమాన పడ్డారని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదవ సంఘ భవనంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ఉద్యోగుల సమస్యలు, ఇతర విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముందుండి పోరాడుతుందన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. మెనిఫెస్టో కమిటీలో సభ్యుడిగా రెగ్యూలరైజేషన్‌కు సాంకేతిక సమస్యలున్నాయని, అప్పటి వరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సూచించడం జరిగిందన్నారు. త్వరలోనే అది అమలవుతుందన్నారు.


మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి : బొర్రన్న

బోథ్, మార్చి 8: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందిన నాడే సమాజం అభివృద్ధి చెందుతుందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దన్నూరు(బి) గ్రామంలో మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తల్లిగా, తోబుట్టువుగా, భార్యగా, మహిళలు ఎంతగానో కుటుంబంలో విధులు నిర్వహిస్తారన్నారు. వారు కుటుంబ అభివృద్ధికి చూపించే చొరవ అభినందనీయం అన్నారు. కుటుంబం అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతగానో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు సరిత, ఇంద్ర, రాజమణి, లావణ్య, లతా, శోభ, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా కృషి'

బోథ్, మార్చి 8: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు చేరే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని శుక్రవారం కోఆర్డినేటర్‌గా ఎన్నికైన తుల అరుణ్ కుమారు అన్నారు. శుక్రవారం ఆయన బోథ్‌కు వచ్చిన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, షేక్, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 । కనిష్ఠం 20.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 9 మార్చి 2024





మస్కాపూర్ శివాలయంలో శివపార్వతుల కల్యాణం





భైంసా బ్రహ్మణ్‌గల్లిలోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తర్లపాడ్‌లో ఓంకారేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

శివోహం

- జిల్లాలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- ముక్కంటి నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- అంతటా శివాలయాలకు పోటెత్తిన భక్తజనం
- రోజంతా ఉపవాసం.. రాత్రంతా జాగరణ
- నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం
- నేడు జిల్లా వ్యాప్తంగా అన్నదాన కార్యక్రమాలు





ఓం నమః శివాయ.. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శుక్రవారం ఉత్సవ శోభ నెలకొంది. తెల్లవారు జాము నుంచే భక్తులు పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఉపవాసాలు, జాగరణలు చేస్తూ ఆదిశివున్ని ధ్యానిస్తూ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆధ్యాత్మిక భావాలు వెల్లివిరిసాయి. తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అభిషేక ప్రియుడైన శివునికి భక్తులు పాలు, జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలకు తరలివెళ్లే భక్తులతో రహదారులన్నీ సందడిగా మారాయి. జిల్లాకేంద్రంలోని శివాలయాలతోపాటు భైంసా పట్టణంలోని శివాలయాలు, మహదేవ్ మందిరాలు, లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం భక్తులు పాటెత్తారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి శివపార్వతుల సేవలో తరించారు. పలు ప్రాంతాల్లో రాత్రి వేళలో జాగరణను పురస్కరించుకొని ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం, నేత్రపర్వంగా సాగాయి. శనివారం శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

● (ఆంధ్రజ్యోతి, నిర్మల్ నెట్‌వర్క్)



రథాల గుడి బ్రహ్మపురిలో రుద్రాభిషేకం



మున్యాల్ గోండుగూడెంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



కదిలిలో పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు



ఉత్తర వాహినిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులు



మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆడబిడ్డలను కాపాడుకోవడం అందరి బాధ్యత

- మహిళలకు ఏదైనా జరిగితే వెంటనే శిక్షపడేలా చట్టాలు రావాలి
- ఖానాపూర్‌లో జరిగిన యువతి హత్య ఘటన చాలా బాధించింది
- ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వ్యాఖ్యలు

ఖానాపూర్, మార్చి8: ఆడబిడ్డలను కాపాడుకోవడం అందరి బాధ్యతని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం మహిళల సంఖ్య పురుషుల సంఖ్య కంటే తక్కువగా ఉందన్నారు. కొంతమంది అమ్మాయి పుడుతుందని తెలిసి భ్రూణ హత్యలకు సైతం పాల్పడడం బాధాకరమన్నారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మీదేవి అని, స్త్రీలేనిదే సమాజం లేదని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకొని బాలికలు చదువుకుని అన్నిరంగాల్లో ఎదిగేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మహిళలకు ఏదైనా జరిగితే వెంటనే శిక్షపడేలా దేశంలో చట్టాలు రావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఖానాపూర్‌లో అలేఖ్య హత్య ఘటన తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే తప్పు చేసేవారికి కచ్చితంగా కఠిన శిక్షలు పడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల పట్ల ఎంతో గౌరవంతో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలంటే ఎనలేని గౌరవమని, అందుకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 సిలిండర్‌తోపాటు ప్రతీ మహిళకు రూ.25,00 చేయూతను అందించేలా తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు రాజకీయ రంగాల్లో సైతం రాణించాలని తమ ప్రభుత్వం కోరుకుంటుందని, అందుకు సాధారణ మహిళ నుంచి సీతక్క రాష్ట్ర మంత్రిగా ఎదిగిందన్నారు. ఇదివరకే ఖానాపూర్ నియోజకవర్గంలో గత రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అజ్మీరా రేఖానాయక్ ప్రస్తుతం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రేఖానాయక్‌కు టికెట్ వస్తే పార్టీ శ్రేణులు అంతా పనిచేయాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ సహా సుమారు 150 మంది మహిళలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఘనంగా సన్మానించారు.

● పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా కాంగ్రెస్ గెలుపు కోసమే పనిచేస్తా: మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినప్పటికీ తాను కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని రేఖానాయక్ స్పష్టంచేశారు. గత పాలకుల వలే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో మంచి చేసేలా ఉన్నాయన్నారు. పార్టీ అధిష్ఠానం అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి వెడ్మ బొజ్జు పటేల్‌కు టికెట్ ప్రకటించిన నాడు తాను స్వాగతించానన్నారు. ఇప్పుడు కూడా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మహిళలు పాల్గొన్నారు.

'తక్షణమే సీపీఎస్ రద్దు చేయండి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్ అర్బన్, మార్చి8: అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేస్తామని ఎన్నికల ముందు సీఎం హామీ ఇచ్చారని, దాన్ని అనుసరించి తక్షణమే ఓపీఎస్ అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధికార (టీపీసీసీ) ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్థన్ రెడ్డికి విజ్ఞాపన పత్రం అందజేశారు. సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఉద్యోగ, ఉపాధ్యాయులు బ్రహ్మరథం పడతారని అన్నారు. 317లో స్థానికత కోల్పోయిన వాటిని వచ్చే విద్యాసంవత్సరంలోగా సొంత జిల్లాలకు తేవాలని కోరారు. ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, సీపీఎస్ రాష్ట్ర సహా అధ్యక్షుడు రేవంత్, జిల్లా నాయకులు సాయికృష్ణ, కొండా ప్రవీణ్, తానాజి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి8: జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనంచేశారు. ఆపార్టీ అధికార ప్రతినిధి హర్షవర్థన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... అధికారంలో ఉండగా ఏనాడు ఉద్యోగ, ఉపాధ్యాయులను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని స్వార్థం కోసం వాడుకుందని ఆరోపించారు. మాజీమంత్రి హరీశ్‌రావు ఉపాధ్యాయ, ఉద్యోగస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల కేంద్రాల్లో హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ప్రతినెలా ఒకటినే జీతాలు చెల్లించడాన్ని జీర్ణించుకోలేక హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కారన్నారు. బీఆర్ఎస్ పాలనలో సకాలంలో జీతాలు చెల్లించలేకపోయిందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం'

నిర్మల్ కల్చరల్, మార్చి8: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉందని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అధ్యక్షుడు ఒడ్నాల రవిరాజు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ... 317 జీవో సమస్యలపై తలెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు తమకృషి వల్ల మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటైందన్నారు. త్వరలో మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఈ సమస్యను పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్‌రాష్ట్ర ఉద్యోగుల బదిలీలు, కేజీబీవీలకు టైంస్కేల్, సమగ్ర శిక్ష అభియాన్, ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జిల్లా నూతన కమిటీని ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శిగా రవిరాజు, గౌరవ అధ్యక్షుడిగా సిరికొండ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీఆర్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● సమస్యలను పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఆర్టీయూ జిల్లా నూతన అధ్యక్షుడు వై. సాయన్న అన్నారు. శుక్రవారం ఎన్నిక అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సాయన్న ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ముజ్గిలో రోడ్డు పనుల ప్రారంభం

నిర్మల్ కల్చరల్, మార్చి8: మండలంలోని ముజ్గి గ్రామంలో శుక్రవారం ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ సంతోష్, జడ్పీటీసీల ఫోరమ్ చైర్మన్ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వర్, పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ముథోల్ ఎమ్మెల్యే

ముథోల్, మార్చి8: ముథోల్ నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తరోడా తండా గ్రామంలో రూ. 1 కోటి 4 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రహదారి సరిగా లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులకు ఈ రోడ్డు నిర్మాణంతో తిప్పలు తప్పనున్నాయని తెలిపారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపీటీసీ గంగాధర్, నాయకులు మాజీ సర్పంచ్ ఆరిఫ్, నర్సాగౌడ్, సురేందర్ రెడ్డి, రమేష్, కోరి పోతన్న, కె. పోతన్న, శ్రీనివాస్, రవి కిరణ్ గౌడ్, కలీం, చిన్నన్న, అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అలేఖ్య హత్య కేసులో నిందితులకు శిక్షపడేలా

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయండి

- దాడిలో గాయపడ్డ జయశీలకు ప్రభుత్వ ఉద్యోగమిచ్చి ఆదుకోండి
- ఎమ్మెల్యేను కోరిన అలేఖ్య కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు



ఎమ్మెల్యే బొజ్జుకు వినతి పత్రం అందజేస్తున్న నంది రామయ్య, అలేఖ్య కుటుంబ సభ్యులు

ఖానాపూర్, మార్చి8: ఖానాపూర్ పట్టణం నడిబొడ్డున అత్యంత దారుణంగా హత్యకు గురైన షెట్పల్లి అలేఖ్య హత్య కేసు విచారణ వేగవంతం కోసం వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడుతూ ప్రేమపేరిట అలేఖ్య వెంటపడి ఆమె తిరస్కరించడంతో ప్రేమోన్మాది జూకింది శ్రీకాంత్ అలేఖ్యను అత్యంత దారుణంగా హత్య చేశాడన్నారు. నడిరోడ్డుపై ఓ యువతిని వేట కొడవలితో నరికి చంపిన హంతకుడు జూకింది శ్రీకాంత్‌ను, అతనికి సహకరించిన తల్లి, తమ్ముడిని కఠినంగా శిక్షించాలన్నారు. కేసు విచారణ వేగంగా జరిగేందుకు వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేని కోరారు. అదే ఘటనలో హంతకుడు చేసిన విచక్షణారహిత దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడిన జయశీల ఒకచేయి పూర్తిగా పనిచేయకుండా పోయిందన్నారు. హంతకుడు చేసినదాడిలో చేతిని పోగొట్టుకున్న జయశీలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడిన జయశీల పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆమెకు న్యాయం చేసేలా తనవంతుగా సహకరిస్తానన్నారు. తాను ఈనెల 10వ తేదీన సీఎం రేవంత్ రెడ్డిని కలువబోతున్నానని, ఆ సమయంలో అలేఖ్య హత్యతోపాటు ఆమె కుటుంబానికి జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేసు విచారణలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి కావలసిన అన్ని చర్యలను చేపట్టేలా తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. వెంటనే ఫోన్ ద్వారా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు ప్రక్రియ కోసం ప్రభుత్వం నుంచి చేపట్టాల్సిన చర్యలు ఏంటో జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అమానుల్లా ఖాన్, కట్ట శ్రీనివాస్, మేదరి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.